క్లుప్తంగా

రేపు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి బుధవారం వరకు ఉచితంగా అష్టాంగ యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకరబాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయని, యోగాసనాలు, ప్రాణాయామం, షట్‌క్రియలు, ధ్యానంలను ప్రముఖ యోగా గురువు శ్రీ నిర్మలానందగిరి స్వామి నేర్పిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు యోగా గురువులు రామసుబ్బారెడ్డి 9154557702, మునిశేఖరరెడ్డి 9642080829లకు సంప్రదించాలన్నారు.

వైద్య పరీక్షలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో కామనూరు పీహెచ్‌సీలో గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుస్మిత పరీక్షలు నిర్వహించి పోషకాహారం గురించి వివరించారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం తీసుకోవాలన్నారు. నెల నెలా తప్పకుండా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ గర్భిణీలకు, ఆస్పత్రి సిబ్బందికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

పోరుమామిళ్ల : గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఏఎన్‌ఎంలకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి మాతా శిశు సంరక్షణ పట్ల అవగాహన ఉండాలని మాతా శిశు సంరక్షణ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుప్రీత తెలిపారు. శనివారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యసిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే సిబ్బంది మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డను ప్రసవించే వరకు ప్రతినెల రక్త పరీక్షతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షా కాలంలో రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీలత, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే నిరసన దీక్షలు

ప్రొద్దుటూరు : తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం మహాజన సోషలిస్టు పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి యాడికి రమేష్ మాదిగ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టారు. బాలయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపడుతామని బీజేపీ హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. నాయకులు నాగరాజు, రామచంద్ర మాదిగ, ఎల్లయ్య మాదిగ, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

• వెల్లాలలో ప్రత్యేక పూజలు

రాజుపాళెం : శ్రావణ మాసంలో నాల్గవ శనివారం కావడంతో మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను పల్లకిలో ఆశీనులు చేసి వైభవంగా ఊరేగించారు. ఆలయ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆలయ ఈఓ బీవీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, భక్తులు స్వాములకు పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంజీవరాయ అన్నదాన సత్రంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.



రాజుపాళెం: స్వాములను ఊరేగిస్తున్న భక్తులు

• గోవింద నామస్మరణతో మార్మోగిన కొండగోపాలస్వామి ఆలయం





ప్రత్యేక అలంకరణలో శ్రీకొండగోపాలస్వామి మూలవిరాట్, స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అట్లూరు : శ్రీ కొండగోపాలస్వామి ఆలయం శనివారం భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగింది. శ్రావణ మాసం నాలుగో శనివారం వేకువజామునుంచే భక్తులు కొండగోపాలస్వామి ఆలయానికి చేరుకున్నారు. చివరి వారం కావడంతో శ్రీగోపాలస్వామి రుక్మిణి, సత్యభామలకు కల్యాణం నిర్వహించారు. వచ్చిన భక్తులు స్నానపు గుండంలో స్నానమాచరించి తలనీలాలు సమర్పించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు.

అనంతరం భక్తులకు ఆలయ కమిటి తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శనివార వ్రతానికి పోటెత్తిన మహిళలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిజశ్రావణమాసం చివరి శనివారం నిర్వహించిన వ్రతానికి మహిళలు పోటెత్తారు. అధిక శ్రావణ, నిజశ్రావణ మాసాల్లో వచ్చే 7 శనివారాల్లో వ్రతం నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించి శనివార వ్రతాలు నిర్వహించారు. 9 వ తేదీ చివరి శనివారం కావడంతో మహిళలు వ్రతంలో పాల్గొనేందుకు భారీగా తరలి వచ్చారు. అర్చకులు కిషోర్‌శర్మ శాస్త్రబద్ధంగా వ్రతాన్ని మహిళలతో ఆచరింపచేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి జనార్దనశెట్టి, కోశాధికారి వెంకటసుబ్రమణ్యం(రత్నా), ముచ్చర్ల సుధాకర్‌లు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



పోరుమామిళ్లలో వైభవంగా జరిగిన శనివార వ్రతం



రాష్ట్రంలో 2015లో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సీఐడీ పోలీసులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్టు చేయడంపై సాధారణ ప్రజలు స్పందించారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా.. ఏదో ఒక రోజు శిక్ష అనుభవించక తప్పదని, అదే పరిస్థితి ప్రస్తుతం చంద్రబాబుకు ఎదురైందని పేర్కొంటున్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

నిర్దోషిగా నిరూపించుకోవాలి

చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నాయకులు ఆందోళనలు చేయడం, ప్రభుత్వాన్ని విమర్శించడం సరైంది కాదు. చంద్రబాబు వ్యవస్థలను అడ్డుపెట్టుకొని తన తప్పులను కప్పిపెట్టుకుంటున్నారు. సరైన ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. తప్పు చేయనప్పుడు ఇంత రాద్ధాంతం చేయాల్సిన పనిలేదు. కోర్టులో నిర్దోషిగా నిరూపించువాలి.

– తవ్వా వెంకటయ్య, ఖాజీపేట

టీడీపీ ఆందోళనలు అర్థరహితం

చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న ఆందోళనల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. సామాన్యులకు ఇబ్బందులు తప్పా. అక్రమాలపై అన్ని ఆధారాలు సీఐడీ అధికారుల వద్ద పక్కాగా ఉన్నాయి. అందుకే సీఐడీ అరెస్ట్ చేసింది. ఏతప్పు చేయనప్పుడు ఆందోళనలు చేయల్సిన అవసరం లేదు. కోర్టులో తన నిజాయితీని నిరూపించుకోవాలి.

– ఈశ్వరరెడ్డి, రైతు కొత్తపేట

ప్రభుత్వానికి సంబంధం లేదు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీఐడీ పోలీసులు అరెస్టు చేయడంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. పక్కా ఆధారాలతోనే సీఐడీ అరెస్టు చేసింది. దీనిపై టీడీపీ వారు రాద్ధాంతం చేస్తున్నారు. తప్పు చేశారని నిర్ధారించుకొని అరెస్టు చేశారు. చంద్రబాబు బండారం బయటపడింది.

– టి.నరసింహారెడ్డి, వనిపెంట, మైదుకూరు మండలం

చంద్రబాబు బుకాయింపు కుదరదు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు తప్పు చేశారని సీఐడీ అరెస్టు చేసింది. తాను తప్పు చేయలేదని చంద్రబాబు బుకాయించడం కుదరదు. స్పష్టమైన ఆధారాలతోనే అరెస్టు చేసినట్లు సీఐడీ చెబుతోంది. తమ నాయకుడు అరెస్టు కావడంతో టీడీపీ శ్రేణులు తప్పు కప్పిపుచ్చే విధంగా నిరసనలు చేయడం శోచనీయం.

– నీలం వెంకటరామిరెడ్డి, ఓబులాపురం, మైదుకూరు

ప్రజల సొమ్ము తిన్నోళ్లు జైలుకే



వివిధ పథకాలపై ప్రజల సొమ్మును తిన్నోళ్ల జైలు పాలు కావాల్సిందే. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు పలు పథకాల్లో అవినీతికి పాల్పడిన విషయం తెలిసిందే. అందుకు విచారణలో భాగంగా చంద్రబాబును అరెస్టు చేయడం మంచిదే. ప్రజల సొమ్ము తినేవాళ్లంతా జైలుపాలు కాక తప్పదు.

– సుధీర్‌కుమార్‌రెడ్డి, గోపాయపల్లె గ్రామం, రాజుపాళెం మండలం

అధికారులు తమ పని చేస్తున్నారు



ప్రజల పేరు చెప్పి పలు పథకాల్లో అవినీతికి పాల్పడిన వారిని అధికారులు ఎప్పటికీ వదిలి పెట్టరు. ఏ ప్రభుత్వంలోనైనా ప్రజలకు చెందాల్సిన పథకాలను వారికే అందించాలి. ప్రజల సొమ్మును దోపిడీ చేసినందుకు పక్కా ఆధారాలతో చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసింది. చట్టం దృష్టిలో అందరూ సమానమే.

– ధనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టంగుటూరు గ్రామం, రాజుపాళెం మండలం

తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే



ఎవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. అది చంద్రబాబునాయుడు కావచ్చు మరొకరు కావచ్చు. చంద్రబాబు తప్పు చేయలేదని అన్నా కూడా అధికారులు తప్పు చేసినట్లు నిరూపించారు.

డి.చెంచయ్య, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

చంద్రబాబు బండారం బట్టబయలైంది



చంద్రబాబు అరెస్టుతో ఆయన చేసిన మోసాలు, దోపిడీ బండారం బట్టబయలైంది. చంద్రబాబు అరెస్టును ఎల్లోమీడియా, బీజేపీలోని టీడీపీ కోవర్టులు ప్రచార ఆర్భాటాలకు తెరలేపారు. చంద్రబాబు మహాత్ముడు, మహనీయుడో కాదన్నారు. చట్టంలోని లోపాలను అడ్డుపెట్టుకుని చేసిన తప్పుల నుంచి తప్పించుకుంటూ వస్తున్న ఆయన పాపం పండి అరెస్టు అయ్యారు. చట్టం ఎవరికీ చుట్టం కాదు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అన్ని ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసి అరెస్టు చేసింది.

– జింకా విజయలక్ష్మి, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్ పర్సన్

తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే



తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే. చంద్రబాబు తన అధికారాన్ని అడ్డు పెట్టుకుని అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే సీఐడీ పక్కా ఆధారాలతో అరెస్టు చేసింది. బాబుకు పదేళ్ల శిక్ష పడే అవకాశం ఉంది. చట్టం ఎవరికి చుట్టం కాదు,

– అడ్వొకేట్ ఇమాం బాషా, దువ్వూరు

స్టేలతో ఎన్నాళ్లు తప్పించుకుంటాడు

చంద్రబాబు ఇన్నాళ్లూ తనపై వచ్చిన కేసులను స్టేలతో తప్పించుకుంటూ వస్తున్నాడని అందరికీ తెలుసు. అందరినీ ఎంతకాలం నమ్మించగలడు. రూ.371 కోట్లు దారి మళ్లించి స్వాహా చేసినట్లు ఇప్పుడు ప్రజలందరికీ తెలిసింది.

-సహదేవరెడ్డి, విశ్రాంత ఉద్యోగి

తప్పు ఒప్పు కాదు



ఎవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందే. తప్పు ఒప్పు ఎప్పటికీ కాదు. చంద్రబాబు చేసిన తప్పును అధికారులు నిగ్గు తేల్చి అరెస్టు చేశారు. గతంలో కూడా కొంత మంది రాజకీయ నాయకులు తప్పు చేసి జైల్లో ఉన్నారు. ఇది కూడా అంతే.

రమణయ్య, కొండ్రాజుపల్లె, కాశినాయన మండలం

చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే



చేసిన తప్పుకు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. సీఐడీ అన్ని ఆధారాలతోనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసింది. ప్రజల సొమ్మును స్వాహా చేస్తే చట్టం ఊరికే వదలదు. పిల్లను ఇచ్చిన మామ ఎన్‌టీఆర్‌కు చేసిన మోసం, ద్రోహం ఇన్ని రోజులకు పండింది.

– కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరు

పక్కా ఆధారాలతోనే అరెస్టు



చంద్రబాబును అరెస్టు చేయడంలో తప్పు లేదు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలు చాలా జరిగాయి. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఇన్నాళ్లు తప్పించుకోగలిగాడు. పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్టు చేసి. బాబు విచారణను ఎదుర్కోవాల్సిందే.

– శంకర్ నారాయన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, దువ్వూరు

చంద్రబాబుకు శిక్ష తప్పదు

చంద్రబాబునాయుడు చేసిన తప్పులకు ఎప్పటికైనా శిక్ష తప్పదు. చంద్రబాబు మాటలు ఇన్నాళ్లు నిజమే అనుకున్నాం. ఇప్పుడు ఇక బయట పడటం కష్టమే అనుకుంటున్నాను.

-రాఘవరెడ్డి, యువ వ్యాపారి

చంద్రబాబు అరెస్ట్ సమంజసమే..



స్కిల్ స్కామ్ కేసులో కొంచెం ఆలస్యమైనా సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేయటం సమంజసమే. చాలా కేసుల్లో వ్యవస్థలను అడ్డుబెట్టుకుని తప్పించుకుంటున్న చంద్రబాబును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవినీతిని బయటికి చట్టం ముందకు తీసుకురావటం హర్షణీయం. సీమెన్స్ కంపెనీ ఎలాంటి పెట్టుబడి పెట్టకపోయినా 90 శాతం పెడుతోందని చెప్పి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 10శాతం నిధులు కేటాయించి షెల్ కంపెనీలకు మళ్లించింది. సీమెన్స్ కంపెనీ ప్రతినిధులే స్వయంగా తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పింది. ప్రజాధనాన్ని దోచుకున్న చంద్రబాబును అరెస్ట్ చేయటాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

– రామసుధాకర్‌రెడ్డి, పోగ్రెసివ్ ఫౌండేషన్ చైర్మన్, చాపాడు

చట్టానికి ఎవరూ అతీతులు కారు



ప్రజల సొమ్ము స్వాహా చేసిన తప్పు ఎప్పటికైనా బయట పడుతుంది. చట్టం తప్పక శిక్షిస్తుంది. చంద్రబాబు నాయుడు విషయంలో ఇదే జరిగింది. చట్టానికి ఎవరూ అతీతులు కారు. అన్ని ఆధారాలతోనే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసింది.

– బండారు రఘురామయ్య, ప్రొద్దుటూరు

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు



తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని నిరూపితమైంది. నైపుణ్యాభివృద్ధి పేరిట యువతను నిలువునా మోసం చేసిన చంద్రబాబును అరెస్టు చేయడంలో తప్పేమీ లేదు. పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాతనే సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

టి.వెంకటసుబ్బయ్య, బద్వేలు

చట్టం దృష్టిలో అందరూ సమానులే



చట్టం దృష్టిలో అందరూ సమానులే అని చంద్రబాబు అరెస్టుతో తేటతెల్లమైంది. నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చంద్రబాబు తన అక్రమాలకు ఉపయోగించుకోవడం దారుణమైన అంశం. కొందరు చంద్రబాబు అరెస్టును వ్యతిరేకించడం అవివేకమే అవుతుంది.

– జి.లెనిన్, బద్వేలు

చేసిన పాపాలు ఊరికే పోవు

చేసిన పాపాలు ఊరికే పోవని పెద్దలు ఎప్పుడో చెప్పారు. చంద్రబాబు చేసిన పాపం ఇన్నాళ్లకు పండుతోంది. శిక్ష అనుభవించకుండా తప్పించుకోలేడు.

-కత్తెరగండ్ల వెంకటసుబ్బయ్య, కార్పెంటర్

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుండి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు 2009 అరటిపండ్లతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా మూలవిరాట్‌ను గజమాలలతో అలంకరించారు. కొబ్బరి కాయలు కొట్టి, వడమాల సేవ, ఆకుపూజలను చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి భక్తుల రద్దీ కనిపించింది. సాయంత్రం ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తిని హనుమత్ నామస్మరణల మధ్య ప్రాకారోత్సవం చేశారు. అలాగే లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస శనివారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

శివరామానంద సరస్వతిని సన్మానించిన ఆర్యవైశ్యులు



శివరామానంద సరస్వతిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

పోరుమామిళ్ల : పట్టణంలో శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయాన్ని పునఃనిర్మించి ఏడేళ్లు కావడంతో శనివారం సప్తమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసం స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే శివరామానంద సరస్వతిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాజులపల్లె శ్రీనివాసులు, మహిళా మండలి అధ్యక్షురాలు కాకుమాని కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు శాలువా, పూలదండతో ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, పలువురు నాయకులు

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాచునూరు రామకృష్ణారెడ్డి మృతదేహానికి శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, యువనాయకుడు ఆదిత్యారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాచునూరు రామకృష్ణారెడ్డి 8వ తేదీన బద్వేలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వారు శనివారం కామసముద్రం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించిన అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి చైర్మన్ మాధవరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య, శాప్ డైరెక్టర్ కొండు శేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, స్థానిక సర్పంచ్ ఆర్‌వీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో రాజీ అయిన కక్షిదారులకు అవార్డు ఫారం అందజేస్తున్న న్యాయమూర్తులు

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథఆచారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసి 289 క్రిమినల్ కేసులు, 37 సివిల్ కేసులు చొప్పున మొత్తం 326 కేసులు పరిష్కరించారు.